సాక్షి
ఖమ్మం
ఆదివారం ♦ 23 ♦ ఫిబ్రవరి ♦ 2025



ఎన్నాళ్లకు.. ఎన్నేళ్లకు!

ఖమ్మంలో సుమారు ఇరవై ఏళ్ల తర్వాత అగ్నిమాపక శాఖ కార్యాలయ భవన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. 8లో



వంద శాతం ఫలితాల సాధన

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఎస్సెస్సీ విద్యార్థుల ఉత్తీర్ణత వంద శాతం నమోదయ్యేలా కృషి చేయాలని డీడీ మణెమ్మ సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
36° / 19°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం కాస్త చలి ప్రభావం ఉన్నా మధ్యాహ్నానికి ఎండ పెరుగుతుంది. మళ్లీ రాత్రి చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి ఉమాదేవి

ఖమ్మం లీగల్: న్యాయవాదుల వృత్తిపరంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి సూచించారు. ఐఏఎల్(ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్) ఆధ్వర్యాన శనివారం ఖమ్మం డీపీఆర్‌సీ భవనంలో శిక్షణ తరగతులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ న్యాయవాదులు నిరంతరం వృత్తిపరమైన నైపుణ్యాలు పెంచుకుంటూ, సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఇందులో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ఆతర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, క్రాస్ ఎగ్జామినేషన్‌పై న్యాయవాదులు గంటా విద్యాసాగర్‌రెడ్డి, బెక్కం భగత్‌సేన వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు అపర్ణ, అర్చనకుమారి, డి.రాంప్రసాద్, శీనయ్య, ఎం.కల్పన, శివరంజని, ఐఏఎల్ బాధ్యులు పొట్ల మాధవరావు, పెమ్మిసాని పట్టాబి, దుస్సా జనార్దన్, షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో రీడింగ్ గదుల ఏర్పాటు


సమీక్షలో వివరాలు ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రతీ మండలంలో రెండేసి పాఠశాలల్లో రీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో శనివారం సమావేశమైన ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేలా ప్రతీ మండలంలో రెండు పాఠశాలలను ఎంపిక చేసి రీడింగ్ రూమ్‌ల ఏర్పాటు చేయాలన్నారు. అలాగే, గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ వసూళ్లపై దృష్టి సారించాలని, లైబ్రరీల్లో అవసరమైన మరమ్మతులు చేయించాలని తెలిపారు. లైబ్రరీలకు గతేడాది కేటాయించిన నిధులు, వ్యయం, భవిష్యత్ ప్రణాళికలపై నివేదికలు సమర్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. డీఈఓ సోమశేఖర శర్మ, డీపీఓ ఆశాలత, జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి అర్జున్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం నిఘా


ఉద్యోగులకు సూచనలు చేస్తున్న సీపీ

కామేపల్లి: ఇసుక అక్రమ రవాణాను నిలువరించేలా నిరంతరం నిఘా పెట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. కామేపల్లి మండలంలోని కొత్తలింగాల క్రాస్‌లో ఏర్పాటుచేసిన చెక్ పోస్టును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర, జిల్లా సరిహద్దుల మీదుగా ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చెక్ పోస్ట్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వాగులు, నదీ పరీవాహక ప్రాంతాల్లో నిఘా పెంచి ఇసుక అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్టప్రకారం జరిమానా విధించడమే కాక కేసు నమోదు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారికి అభిషేకం, నిత్యకల్యాణం


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. గర్భగుడిలో మూలవిరాట్‌తో పాటు ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదానికి పంచామృతంతో అర్చకులు అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మ వార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించగా, భక్తుల సమక్షాన పల్లకీ సేవ చేశారు. ఈ పూజల్లో ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నువ్వా.. నేనా ?!



టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థుల పోటాపోటీ ప్రచారం

- తాము గెలిస్తేనే సమస్యల పరిష్కారమని భరోసా
- ఉమ్మడి జిల్లాలో 6,111 మంది ఓటర్లు, 47 పోలింగ్ కేంద్రాలు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం – నల్లగొండ – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. ఈనెల 27న జరగనున్న పోలింగ్‌కు 25వ తేదీతో ప్రచారం ముగియనుండగా అభ్యర్థులు ఓట్ల సాధనకు పోటాపోటీగా ప్రచారంలో మునిగారు. ఓ వైపు అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూనే.. మరోవైపు ప్రత్యర్థి బలహీనతల ఆధారంగా ముందుకు సాగుతున్నారు. తమను గెలిపిస్తేనే ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని హామీలు గుప్పిస్తున్నారు. అభ్యర్థులకు తోడు ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు, కుల సంఘాల నాయకులు కూడా దూసుకెళ్తుండడం విశేషం. కాగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 6,111 మంది ఓటర్లకు గాను 47 పోలింగ్ కేంద్రాలను గుర్తించిన అధికారులు ఇతర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

బరిలో 19మంది..

ఈ స్థానానికి 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా, పలు ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో అలుగుబెల్లి నర్సిరెడ్డి రెండో ప్రాధాన్యత ఓట్లతో గెలిచారు. రెండో స్థానంలో నాడు పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి పూల రవీందర్ నిలిచారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధాన ఉపాధ్యాయ సంఘాలతోపాటు రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల మద్దతుతో వారు పోటీ పడుతున్నారు.

సై అంటే సై..

మునుపెన్నడూ లేని విధంగా టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నిక ఇటు ఉపాధ్యాయ సంఘాలు, అటు రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ కలిగిస్తోంది. మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలని అలుగుబెల్లి నర్సిరెడ్డి, తమను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పులి సరోత్తమ్ రెడ్డి, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, పూల రవీందర్, ఎస్.సుందర్‌రాజ్‌యాదవ్ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు.

మరోసారి గెలిపిస్తే..


అలుగుబెల్లి నర్సిరెడ్డి

యూటీఎఫ్ అభ్యర్థిగా వివిధ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతుతో బరిలో నిలిచిన అలుగుబెల్లి నర్సిరెడ్డి ఇన్నాళ్లు ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై పోరాడినందున మరోమారు గెలుస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మొదటి పీఆర్‌సీ సమయాన ఇందిరా పార్కు వద్ద నిరాహార దీక్ష, మెరుగైన ఫిట్‌మెంట్ సాధన, కేజీబీవీ, యూఆర్‌ఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులకు వేసవి సెలవులు, 12 నెలల వేతనం వచ్చేలా కృషి చేస్తానని ప్రచారంలో చెబుతున్నారు.

ఆ ఘనతలు మావే..


పింగిలి శ్రీపాల్‌రెడ్డి

పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డి విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఉపాధ్యాయినులకు ఐదు అదనపు సెలవులు, అప్రెంటిస్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు, 13 రోజుల సమ్మె కాలానికి వేతనం మంజూరు ఘనత తమకే దక్కుతుందని ప్రచారాస్త్రంగా చేసుకున్నారు. సర్వీస్ రూల్స్ సాధన, ఉపాధ్యాయులకు ఉన్నతస్థాయి పదోన్నతులు, సీపీఎస్ విధానం రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సాధనకు పోరాడుతానని చెబుతున్నారు.

పార్టీ బలం.. ఉపాధ్యాయ సంఘాల మద్దతు


పులి సరోత్తమ్‌రెడ్డి

బీజేపీ, ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో పులి సరోత్తమ్‌రెడ్డి పోటీలో నిలిచారు. ఆయన ప్రచార బాధ్యతలను బీజేపీ భుజానికెత్తుకోగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 317 జీఓతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా కృషి చేయడంతో ఇతర సమస్యలు పరిష్కరిస్తానని చెబుతున్న సరోత్తంరెడ్డి తనను గెలిపించాలని కోరుతున్నారు.

టీజేఏసీ అభ్యర్థిగా పోటీలో..


గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

57సంఘాల మద్దతుతో టీజేఏసీ అభ్యర్థిగా బరిలో ఉన్నట్లు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 10,479 భాషా పండిట్ పోస్టులు అప్‌గ్రేడ్ చేయించానని, టెట్‌తో సంబంధం లేకుండా సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇప్పించానని, ఉపాధ్యాయినులకు చైల్డ్ కేర్ లీవ్, కేజీబీవీల్లో సమస్యల పరిష్కారానికి పాటుపడ్డానని చెబుతున్నారు. తనను గెలిపిస్తే ఉమ్మడి సర్వీస్ రూల్స్, అర్హులకు ఉన్నత స్థాయి పదోన్నతులకు పోరాడుతానని హామీ ఇస్తున్నారు.

సమస్యలు పరిష్కరించా..


పూల రవీందర్

బహుజన ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో పూల రవీందర్ పోటీలో ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయుల హక్కులను కాపాడడానికే పోటీ చేస్తున్నట్లు చెబుతున్న ఆయన ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం పోరాడానని వివరిస్తున్నారు. తనను గెలిపిస్తే సర్వీస్ రూల్స్ సాధన, మెరుగైన పీఆర్‌సీ, కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పాటుపడతానని చెబుతున్నారు.

ప్రశ్నించే గొంతుకనై .. సాధిస్తా


ఎస్.సుందర్‌రాజ్‌యాదవ్

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎస్.సుందర్‌రాజ్‌యాదవ్ ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులతోపాటు ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారు. 317 జీఓపై సమీక్ష, సీపీఎస్ విధానం రద్దు, మెరుగైన పీఆర్‌సీ సాధన, ఉపాధ్యాయులందరికీ 010 పద్దు ద్వారా వేతనాల సాధనకు పోరాడుతానని చెబుతున్న ఆయన పెండింగ్ డీఏల విడుదలకూ కృషి చేస్తానని వివరిస్తున్నారు.

బీసీలకు రాజకీయాలను శాసించే అవకాశం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి పూల రవీందర్‌ను బీసీలంతా ఏకమై భారీ మెజార్టీతో గెలిపించాలని, తద్వారా భవిష్యత్ రాజకీయాలను శాసించవచ్చని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించడానికి సంఘం ఆధ్వర్యాన ఈనెల 17 నుండి 26వ తేదీ వరకు 'ఓటు మనదే.. సీటు మనదే – మేమెంతో మాకంత' నినాదంతో ప్రచార యాత్ర నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పార్టీలకతీతంగా సంఘటితమై బీసీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపిస్తే రాష్ట్ర రాజకీయాలలో రెడ్ల రాజకీయాలకు అడ్డుకట్ట వేసినట్లవుతుందని తెలిపారు. నల్లగొండ – ఖమ్మం – వరంగల్ ఎమ్మెల్సీ పరిధిలో 27వేల మంది ఓట్లకు గాను 2వేల మందే రెడ్డి సామాజికవర్గం వారు ఉండగా, మిగతా వారంతా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలేనని చెప్పారు. అయినప్పటికీ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నలుగురు పోటీలో ఉన్నారని తెలిపారు. ఇక బీసీలకు పార్టీలు సైతం మద్దతు తెలపకుండా అవమానించాయని వెల్లడించారు. ఈనేపథ్యాన ఓటే ఆయుధంగా బహుజనులు ఏకమై రవీందర్‌ను గెలిపించాలని, తద్వారా రాజకీయ అధికారానికి పునాదులు పడి 2028లో బీసీ రాజ్యం సిద్ధిస్తుందని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు సుంకర శ్రీనివాస్, డాక్టర్ కే.వీ.కృష్ణారావు, పేర్లారి విజయ్‌కుమార్, వల్లె సోమరాజు, మోత్కూరి వెంకటేశ్వరాచారి, పసుపులేటి నాసరయ్య, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రమ్‌గౌడ్, అంకిరెడ్డి ప్రసాద్, పద్మాచారి, నరేందర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

- జిల్లాలో 121టీచర్లు, 603 హెల్పర్ పోస్టుల భర్తీకి సన్నాహాలు
- మార్చి మొదటివారంలో పూర్తిచేసేలా కార్యాచరణ

ఖమ్మంవన్‌టౌన్: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా కేంద్రాల్లో వసతుల కల్పనపై దృష్టి సారించగా, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 14,236 పోస్టుల భర్తీకి నిర్ణయించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే నోటిఫికేషన్ జారీ చేసి, పోస్టులను కలెక్టర్ నేతృత్వాన పారదర్శకంగా భర్తీ చేయనున్నారు. ఈమేరకు శనివారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క సంబంధిత దస్త్రాన్ని ఆమోదించారు.

జిల్లాలో 724 పోస్టులు

జిల్లాలో కొన్నేళ్లుగా ఒక సూపర్‌వైజర్‌తోపాటు 123 అంగన్‌వాడీ టీచర్, 603 హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీచర్ల కొరత కారణంగా ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు సెంటర్ల బాధ్యతలు అప్పగించారు. దీంతో కేంద్రాల్లో చిన్నారుల ఆలనాపాలన, లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పుడు ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయనుండడంతో కేంద్రాల ద్వారా మరింత సేవలు అందుతాయని భావిస్తున్నారు.

పలు అంశాల్లో వెయిటేజీ

స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం మార్చి మొదటివారంలో నోటిఫికేషన్ జారీ చేయనుంది. కలెక్టర్ల నేతృత్వాన కమిటీ ద్వారా అత్యంత పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని నిర్ణయించింది. ఇంటర్ మార్కుల ఆధారంగా నియామక ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే చేయనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి కీసర రాంగోపాల్‌రెడ్డి 'సాక్షి'కి శనివారం తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోనుండగా, ఇంటర్ మార్కుల ఆధారంగా 80 పాయింట్లు, అనాథ మహిళలకు 10, దివ్యాంగులకు 10, వితంతు మహిళలకు 10 పాయింట్లను వెయిటేజీగా ఇస్తారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయ్యాక సర్టిఫికెట్లు పరిశీలించి కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ నియామక ప్రక్రియ పూర్తిచేయనుంది.

బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

మార్కెట్ల కార్యకలాపాలపై జేడీఎం సమీక్ష


మిర్చి యార్డులో పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ల నిర్వహణ, ఫీజు వసూళ్లపై మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్ సమీక్షించారు. ఖమ్మంలో శనివారం ఆయన కార్యదర్శులు, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. వెనకబడిన చోట మార్చి నెలాఖరులోగా లక్ష్యాన్ని చేరుకోవాలని, వ్యాపారుల నుంచి బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని తెలిపారు. అలాగే, ప్రభుత్వ సంస్థల వద్ద పేరుకుపోయిన బకాయిలపైనా శ్రద్ధ చూపాలన్నారు. ఖమ్మం సహా ఇతర మార్కెట్లలోనూ మిర్చి కొనుగోళ్లకు ఏర్పాట్లుచేయాలని, తద్వారా రైతులపై భారం తగ్గించాలని ఆదేశించారు. మద్దులపల్లి, నేలకొండపల్లి, ఏన్కూరు, వైరా, మధిరలో ట్రేడర్లు, కోల్డ్ స్టోరేజీల నిర్వాహకులతో సమావేశం కావాలని తెలిపారు. వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం డీఎంఓలు ఎం.ఏ.అలీం, నరేందర్, ఖమ్మం ఉన్నతశ్రేణి కార్యదర్శి ప్రి.వీణ్‌కుమార్, గ్రేడ్–2 కార్యదర్శి వి.సుజన్‌బాబుతో పాటు ఉమ్మడి జిల్లాలోని 14 మార్కెట్ల కార్యదర్శులు, పాల్గొన్నారు. అనంతరం ఖమ్మం మార్కెట్‌లోని మిర్చి యార్డును జేడీఎం శ్రీనివాస్, డీడీ పద్మావతి అధికారులు పరిశీలించారు.

పోరాడితేనే క్రీడల్లో విజయం


క్రీడాకారులు, అసోసియేషన్ బాధ్యులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం


టెన్నిస్ ఆడుతున్న కలెక్టర్

ఖమ్మం స్పోర్ట్స్: క్రీడాపోటీల్లో ఓటమి అంచుకు చేరినా పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం సొంతమవుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీ శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఖమ్మంలో మంచి టెన్నిస్ కోర్టులు ఉన్న నేపథ్యాన తొలిసారిగా జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడా పోటీలకు వేదికగా నిలిచిందని చెప్పారు. టెన్నిస్ శిక్షణ, పోటీల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక వికాసం పెంపొందుతుందని తెలిపారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్న కలెక్టర్ వారితో కలిసి టెన్నిస్ ఆడారు. ఆతర్వాతసర్దార్ పటేల్ స్టేడియంలో సౌకర్యాలను పరిశీలించారు. డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి, ఏసీపీ కుమారస్వామి, ట్రాఫిక్ సీఐ సాంబశివరావు, టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్లపల్లి శ్రీనివాస్, డాక్టర్ కాసినేని అనిల్‌తో పాటు కాంపాటి సత్యనారాయణ, ప్రవీణ్ నాయక్, కాళ్ల పాపారావు, రమేష్, కాళ్ల సూర్య, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

క్వాలిఫయింగ్ రౌండ్ ఫలితాలు

తొలిరోజు పురుషుల విభాగంలో జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో గురునాథన్‌సింగ్, శివప్రణయ్, కుతుంబాక స్వప్నిల్(తెలంగాణ), బత్తుల బాబు, యడ్లపల్లి వివేక్, రాజీవ్‌రెడ్డి(ఆంధ్రప్రదేశ్), ఆదిత్య రాన్‌వాడే(మహారాష్ట్ర), నిఖిల్(కర్ణాటక) అర్హత సాధించారని చీఫ్ రిఫరీ ప్రవీణ్‌నాయక్ తెలిపారు. కాగా, వివిధ రాష్ట్రాల నుంచి 46మంది క్రీడాకారులు హాజరుకాగా, టోర్నీ విజేతకు రూ.2.50 లక్షల నగదు బహుమతి అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

లీజు ఉంటేనే తవ్వకం...

- గడువు ముగిసిన క్వారీలపై నిఘా
- జిల్లాలోని తొమ్మిది చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు


ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లి గుట్ట వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరా

ఖమ్మంఅర్బన్: జిల్లాలో మట్టి అక్రమ తవ్వకాల కట్టడికి మైనింగ్ శాఖ అధికారులు గట్టి నిఘా ఏర్పాటుచేశారు. ట్రిప్పర్, ట్రాక్టర్ ఇలా ఎందులో మట్టి తరలించినా అనుమతి పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచిస్తూ మైనింగ్ సహా రెవెన్యూ, పోలీసు శాఖల ఉద్యోగులు సైతం తనిఖీలు చేపడుతున్నారు. కానీ అక్రమ తవ్వకాలకు అలవాటు పడిన కొందరు రాత్రి వేళ దొంగచాటుగా మట్టి తరలించడం ఆపలేదు. దీంతో గతంలో తవ్వకాలకు అనుమతి ఇచ్చి ప్రస్తుతం లీజ్ గడువు ముగిసిన జిల్లాలోని మండలాల్లో క్వారీల వద్ద సీసీ కెమెరాలు అమర్చారు. వీటిని జీపీఎస్ ద్వారా కార్యాలయానికి అనుసంధానించి అనుమతి లేని క్వారీల్లో మట్టి తవ్వకాలు చేపట్టినా, తరలించినా పరిశీలిస్తూ స్థానిక అధికారులకు సమాచారం ఇస్తున్నారు. ఆ వెంటనే తనిఖీలు చేపడుతుండడంతో అక్రమాలకు అడ్డుకట్ట పడిందని చెబుతున్నారు. జిల్లాలోని రఘునాథపాలెం, ఖమ్మం అర్బన్, ఏన్కూరు, ముదిగొండ మండలాల పరిధిలో గడువు ముగిసిన తొమ్మిది క్వారీల వద్ద సీసీ కెమెరాలు బిగించగా.. మళ్లీ లీజ్ తీసుకుంటే తవ్వకాలకు అనుమతిస్తామని అధికారులు వెల్లడించారు.

నిఘాతో పాటు సైరన్



జిల్లాలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరగకుండా పర్యవేక్షిస్తున్నారు. గడువు ముగిసిన క్వారీల వద్ద సోలార్ ప్యానల్‌తో కూడిన సీసీ కెమెరాలు బిగించి పర్యవేక్షిస్తూనే సైరన్లు కూడా ఏర్పాటుచేశాం. తద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అక్రమాలకు అడ్డుకట్ట వేయడం సులువవుతోంది.

– సాయినాథ్, మైనింగ్‌ఏడీ

బర్డ్‌ఫ్లూ బలాదూర్!

ఉచిత చికెన్, ఎగ్‌మేళాలో జనం రద్దీ


చికెన్, గుడ్లు తీసుకునేందుకు బారులు దీరిన జనం

సత్తుపల్లిటౌన్: కొన్ని ప్రాంతాల్లో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకుతుందన్న ప్రచారంతో జనం చికెన్ తినడానికి జంకుతున్నారు. దీంతో చికెన్ అమ్మకాలు పడిపోగా, 70 సెంటీగ్రేడ్‌కు మించి వేడితో ఉడికించిన చికెన్, కోడిగుడ్లతో ఎలాంటి ప్రమాదం ఉండదని కోళ్లఫారమ్‌లు, పౌల్ట్రీ సంస్థల యాజమాన్యాలు ప్రచారం చేస్తున్నాయి. ఇందులో భాగంగా వెన్‌కాబ్ ఆధ్వర్యాన సత్తుపల్లి పోస్టాఫీస్ సెంటర్‌లో శనివారం రాత్రి ఉచితంగా చికెన్ ఫ్రై, ఉడికించిన కోడిగుడ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా 70 – 100 డిగ్రీల సెంటీగ్రేడ్ వేడిపై ఉడికిస్తున్నందున చికెన్, కోడిగుడ్లతో ప్రమాదం ఉండదని, ప్రజలు అపోహలు విడనాడాలని కోరారు. దీంతో జనం బారులుదీరి చికెన్, గుడ్లు తీసుకునేందుకు ఉత్సాహం కనబరిచారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు ఎం.రాము, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, పవన్, శ్రీనివాస్, మట్టా చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకు.. ఎన్నేళ్లకు!

- అగ్నిమాపక కేంద్రానికి నూతన భవనం
- త్వరలోనే ఎన్నెస్పీ పాత క్వార్టర్స్ స్థానంలో మొదలుకానున్న పనులు
- రూ.3కోట్లతో నిర్మించనున్న హోంశాఖ

ఖమ్మంక్రైం: ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 20ఏళ్ల నుంచి శిథిలావస్థలోని భవనంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఖమ్మం అగ్నిమాపక శాఖకు నూతన భవనం అందుబాటులోకి రానుంది. గతంలోనే నిధులు మంజూరైన నేపథ్యన భవన నిర్మాణానికి హోంశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో త్వరలోనే పనులు మొదలుకానున్నట్లు తెలుస్తోంది.

ఇరవై ఏళ్లుగా ఎన్నెస్పీ క్వార్టర్స్‌లో...

ఇప్పుడు ఇప్పుడు షాదీఖానా ఉన్న స్థలంలో ఏళ్ల క్రితం ఖమ్మం అగ్నిమాపకశాఖ కార్యాలయం ఉండేది. షాదీఖానా నిర్మాణానికి ప్రభుత్వం ఆ స్థలాన్ని కేటాయించటంతో అగ్నిమాపక కార్యాలయాన్ని ఎన్నెస్పీ క్వార్టర్స్‌లో అప్పటికే శిథిలావస్థకు చేరిన భవనంలోకి మార్చారు. కొద్దిపాటి మరమ్మతులు చేయించి కార్యాలయాన్ని కొనసాగించినా, ఆతర్వాత ప్పుడు భవనం పూర్తిగా శిథిలమైంది. అయినా ఎప్పుడు భవనం కూలుతుందో తెలియక, విష పురుగులు, పాములు వస్తాయో తెలియక బిక్కుబిక్కుమంటూనే సిబ్బంది కాలం వెళ్లదీశారు. అనంతరం ఉన్నతాధికారుల చొరవతో అదే ఆవరణలోని ఖాళీ స్థలంలో రెండు గదుల రేకుల షెడ్లు నిర్మించారు. అందులో ఫైర్ అధికారి కార్యాలయంతో పాటు సిబ్బందికి ఒక్కో గది కేటాయించి పదేళ్లుగా కొనసాగిస్తున్నారు.



సరైన రక్షణ లేని షెడ్‌లో వాహనాలు, (ఇన్‌సెట్) ప్రస్తుతం కార్యాలయం కొనసాగుతున్న రేకుల షెడ్



స్థలం, భవనానికి ఎదురుచూపులు

ఎన్నెస్పీ క్వార్టర్‌ను అగ్నిమాపక శాఖకు పూర్తిగా కేటాయించాలని గతంలో పనిచేసిన ఫైర్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా స్థలాన్ని శాఖకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆతర్వాత శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చివేసి నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మళ్లీ కొన్నాళ్లు వినతులు పంపించారు. ఫైర్ ఇంజన్లు నిలపడానికి కూడా స్థలం లేదని మొరపెట్టుకోగా ఐదేళ్ల క్రితం భవన నిర్మాణానికి హోంశాఖ అనుమతి మంజూరు చేసినా పనులు మాత్రం మొదలుకాలేదు.

రూ.3కోట్ల నిధుల మంజూరు

ఖమ్మంలో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల రూ.3కోట్లు మంజూరు చేసింది. దీంతో ఎమ్మెల్సీ కోడ్ ముగియగానే హోంశాఖ ఆధ్వర్యాన శంకుస్థాపన చేసే అవకాశముందని సమాచారం. నూతన భవనంలోనే జిల్లా అగ్నిమాపక శాఖాధికారి కార్యాలయం, అదనపు అగ్నిమాపకశాఖాధికారి కార్యాలయాలే కాక ఖమ్మం అగ్నిమాపక శాఖాధికారి కార్యాలయం కూడా ఏర్పాటు చేయనున్నారు. అలాగే, యంత్రాల పార్కింగ్ ప్రత్యేక షెడ్లు నిర్మిస్తారు.

> **కొన్నాళ్లు ప్రత్యామ్నాయం..**
>
> అగ్నిమాపకశాఖ కార్యాలయ నూతన భవనాన్ని హోంశాఖ ఆధ్వర్యాన నిర్మించనున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న స్థలంలోనే కార్యాలయం నిర్మించాల్సి ఉంది. దీంతో నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయంగా కార్యాలయ నిర్వహణకు అవసరమైన భవనం కోసం ఆరా తీస్తున్నాం. రానున్నది వేసవికాలం అయినందున నీటి వసతి కలిగిన ప్రాంతాన్ని చూస్తున్నాం.
>
> – అజయ్, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి

అగ్నిమాపకశాఖకు ఎస్‌డీఆర్‌ఎఫ్ వాహనాలు



జిల్లా అగ్నిమాపకశాఖకు కేటాయించిన వాహనం

ఖమ్మంక్రైం: జిల్లా అగ్నిమాపక శాఖకు ఎస్‌డీఆర్‌ఎఫ్(స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) నుంచి రెండు వాహనాలను కేటాయించారు. ఈ వాహనాలు హైదరాబాద్ నుంచి ఇటీవలే ఖమ్మం చేరుకున్నాయి. వరదలు, ఇతర విపత్తుల సమయాన పడవులతో పాటు ఇతర సామగ్రి సహా సిబ్బంది వెళ్లేలా వీటిని సమకూర్చారు. సామగ్రి తీసుకెళ్లేందుకు ఒక డీసీఎంతో పాటు సిబ్బంది వెళ్లేందుకు మరో బస్సు ఇందులో ఉన్నాయి. అయితే, ఇంకొంత సామగ్రి రావాల్సి ఉందని, ఆతర్వాత వాహనాలను ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు ప్రతిభా పరీక్ష

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 55 ఆశ్రమ పాఠశాలలు, 12 గిరిజన గురుకులాల నుంచి 335 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని వెల్లడించారు. భద్రాచలం, అంకంపాలెం, ఖమ్మం ఏజీహెచ్‌ఎస్‌లతో పాటు పాల్వంచ, బుజ్జిగూడెం ఏహెచ్‌ఎస్‌ల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆరు సబ్జెక్టుల్లో 25 చొప్పున 150 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఓఎంఆర్ షీట్ ద్వారా పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ పరీక్షలో టాపర్లకు నగదు పురస్కారం అందజేస్తామని, పదో తరగతి తర్వాత సైతం వారు మెరుగైన కాలేజీలు ఎంచుకునేలా అండగా నిలిచి స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తామని పీఓ తెలిపారు.

క్లుప్తంగా

ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్ టోర్నీకి అర్హత



కృష్ణసూరిని అభినందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం స్పోర్ట్స్: అఖిల భారత స్థాయి పోలీసు బ్యాడ్మింటన్ టోర్నీకి జిల్లాకు చెందిన హెడ్ కానిస్టేబుల్ టి.కృష్ణసూరి అర్హత సాధించాడు. ఈనెల 20, 21వ తేదీల్లో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో ఆయన 45–50 ఏళ్ల వయసు కేటగిరీలో పాల్గొని ప్రథమస్థానంలో నిలిచాడు. దీంతో త్వరలోనే కేరళ రాష్ట్రం కొచ్చిలో జరగనున్న ఆల్‌ఇండియా పోలీస్ క్రీడోత్సవాల్లో తెలంగాణ పోలీస్ శాఖ తరఫున పాల్గొననున్నాడు. ప్రస్తుతం అడిషనల్ డీసీపీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న కృష్ణసూరిని శనివారం సీపీ సునీల్‌దత్ అభినందించారు.

నేడు రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ టోర్నీ ఫైనల్స్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ టోర్నీలో భాగంగా శనివారం సెమీస్ నిర్వహించారు. మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఖమ్మం అర్బన్–కల్లూరు జట్లు తలపడగా తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం అర్బన్ జట్టు నిర్ణీత 16ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. ఆతర్వాత బ్యాటింగ్‌కు దిగిన కల్లూరు జట్టు 82 పరుగులకే ఆలౌట్ కాగా ఖమ్మం అర్బన్ జట్టు ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. రెండో సెమీస్ నేలకొండపల్లి– మణుగూరు జట్ల మధ్య జరగగా తొలుత బ్యాటింగ్ చేపట్టిన మణుగూరు జట్టు నిర్ణీత 16 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. అనంతరం నేలకొండపల్లి 12.1 ఓవర్లలోనే 116 పరుగులు చేయడం ద్వారా ఫైనల్స్‌కు చేరింది. ఈమేరకు ఆదివారం ఖమ్మం అర్బన్, నేలకొండపల్లి జట్ల నడుమ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. మ్యాచ్‌లను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డీ.మతిన్ ప్రారంభించగా, వాలీబాల్ కోచ్ ఎం.డీ.అక్బర్ అలీ, సురేష్, చంద్రకాంత్, అంజలి, సిద్ధు, జానీపాషా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో 12 పతకాలు



క్రీడాకారులతో డీవైఎస్‌ఓ, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈమేరకు బి.వైశాలి, డి.బిందు, హజ్రత్ ఫాతిమా, వి.వేణు, అమాన నాజ్, ఎస్.కే.ఆఫ్తాబ్ వివిధ అంశాల్లో సత్తా చాటి ఆరు బంగారు, రెండు రజత, నాలుగు కాంస్య పతకాలు పొందారు. క్రీడాకారులను డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు నున్నా రాధాకృష్ణ, మందుల వెంకటేశ్వర్లు, షఫీక్ అహ్మద్, సుధాకర్, రవి, వెంకటేశ్వర్లు, హాలీం అభినందించారు.

ఉపాధి పనులు పరిశీలన



ఉసిరికాయలపల్లిలో పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ సన్యాసయ్య

కారేపల్లి: మండలంలోని గాజులతండా, ఉసిరికాయలపల్లిల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను డీఆర్‌డీఓ సన్యాసయ్య శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చి ఏరే పనులు ముగిసినందున గ్రామాల్లో అడిగిన వారందరికీ పనులు కల్పించాలని ఉద్యోగులకు సూచించారు. అలాగే, పని ప్రదేశాల్లో నీడ, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఆతర్వాత కారేపల్లి ఐకేపీ కార్యాలయంలో సీసీలతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఎంపీఓ రవీంద్రప్రసాద్, ఐకేపీ ఏపీఎం పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఇంటర్ లింక్ లైన్ ప్రారంభం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు నాగులవంచ, చింతకాని సబ్ స్టేషన్ల మధ్య ఏర్పాటుచేసిన 33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్‌ను ఎన్పీడీసీఎల్ అధికారులు శనివారం ప్రారంభించారు. రెండు సబ్‌స్టేషన్ల మధ్య మూడు కి.మీ. పొడవున ప్రత్యామ్నాయంగా ఈ లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తద్వారా సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ఖమ్మం, పెద్ద గోపతి 132 కేవీ సబ్‌స్టేషన్ల నుంచి సరఫరా తీసుకోవచ్చని, అంతేకాక నాగులవంచ, చింతకాని సబ్ స్టేషన్ల పరిధిలో మెరుగైన సరఫరా ఉంటుందని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ ఏ.సురేందర్, డీఈ సంబూరి రామారావు, ఏడీఈ టి.తిలక్, ఏఈ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.20,487

‘పాలనకు మతం రంగు పూస్తున్న బీజేపీ’



సమావేశంలో మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలనకు మతం రంగు పూస్తూ, ప్రతీ అంశాన్ని మతం కోణంలోనే చూస్తోందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. ఖమ్మం, వైరా, పాలేరు, మధిర నియోజకవర్గాల పార్టీ నాయకుల సమావేశం శనివారం ఖమ్మంలో నిర్వహించగా ఆయన మాట్లాడారు. మెజార్టీ, మైనార్టీ పద్ధతిలో బీజేపీ వ్యవహరిస్తున్న తీరుతో భవిష్యత్‌లో శాంతి కొరవడుతుందని చెప్పారు. మరోపక్క కార్పొరేట్లు తప్ప మిగతా ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని విమర్శించారు. కాగా, కృష్ణా జలాల విషయంలో తెలంగాణ వాటాకు ఇబ్బంది ఎదురైతే సీపీఐ సహించబోదని తెలిపారు. ఇక రైతు భరోసా అర్హులందరికీ అందించాలని, సాగర్ ఆయకట్టు చివరి భూములకూ నీరు అందించాలని హేమంతరావు డిమాండ చేశారు. నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, మిడికంటి చిన్నవెంకట్‌రెడ్డి, యర్రా బాబు, కొండపర్తి గోవిందరావు, ఏపూరి లతాదేవి, అజ్మీరా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిశీల హమాలీ, మిల్ వర్కర్ల రాష్ట్ర కమిటీ ఎన్నిక



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, శ్రీనివాసరావు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఖమ్మంలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో కార్యవర్గాన్ని ఎన్నుకోగా శనివారం వివరాలు వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సి.వెంకటేష్, తల్లాడ మండలం మల్లవరానికి చెందిన ధరావత్ శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం బాధ్యులు తెలిపారు. అలాగే, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జక్కుల యాకయ్య, కొయ్యల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా ఎస్ శ్రీనివాసులు, బి.సీతారాములు, కోశాధికారిగా ఎం.నరసింహులుతో పాటు 21 మంది రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అంతేకాకుండా హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉపాధి, భద్రతతో కూడిన సమగ్ర చట్టాన్ని రూపొందించాలని, గిరిజన సొసైటీల్లో కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, ఎఫ్‌సీఐ బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేసి కార్మికులను కాపాడాలనే తదితర తీర్మానాలు చేసినట్లు తెలిపారు.

నేడు శత సహస్ర హనుమాన్ చాలీసా పారాయణం



ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో వేసిన షామియానాలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో ఆదివారం శ్రీ స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి ఆధ్వర్యాన శత సహస్ర హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నారు. మూడు వేల మంది భక్తులతో ఏకకాలంలో పారాయణం జరగనుండగా శామియానాలు వేయించడంతో పాటు ఇతర ఏర్పాట్లు చేశారు. ఈ పారాయణం రికార్డుల్లో నమోదయ్యేలా ఉమ్మడి జిల్లాలోని భక్త మండళ్ల బాధ్యులు, ఆలయ కమిటీలను ఆహ్వానించారు. ఉదయం 7–30 గంటలకు హనుమాన్ పూజతో ప్రారంభించి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించారు. ఈమేరకు ఏర్పాట్లను స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు వేములపల్లి వెంకటేశ్వరరావు, గన్నవరపు నాగేశ్వరరావుతో పాటు లగడపాటి రామారావు, ప్రతాపని నర్సింహారావు, కురువెళ్ల జగన్మోహన్‌రావు, సూరా విష్ణు, కొత్త వెంకటనారాయణ, ఆదినారాయణ, సతీష్ పర్యవేక్షిస్తున్నారు.

వంద శాతం ఫలితాల సాధనకు కృషి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీడీ మణెమ్మ

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ సూచించారు. భద్రాచలంలోని బీఈడీ కళాశాలలో శనివారం పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యా యులకు ఇచ్చిన శిక్షణలో ఆమె మాట్లాడారు. గత విద్యాసంవత్సరం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో 91 శాతం మంది ఎస్సెస్సీ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఈ ఏడాది వంద శాతం నమోదయ్యేలా కృషి చేయాలని తెలిపారు. ఐటీడీఏ పీఓ రాహుల్ రూపొందించిన ప్రణాళికను పాటించడంతో పాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అలాగే, వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తే జిల్లా రాష్ట్రంలో ముందు నిలుస్తుందని డీడీ తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీరూనాయక్, ఏటీడీఓ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిఘాతో పాటే పెరిగిన ఇసుక ధరలు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో ఇసుక ధరలు పెరిగాయి. గత 15రోజుల క్రితం వరకు టన్ను ఇసుక రూ.900 నుంచి రూ.1,100 వరకు లభించేది. అయితే, ఇందిరమ్మ నిర్మాణాలకు ఇసుక కొరత ఏర్పడకుండా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం సూచించింది. దీంతో అధికారులు చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా తనిఖీలు చేపడుతూ ఎక్కడికక్కడ వాహనాలను సీజ్ చేస్తున్నారు. ఇదే అదునుగా రవాణా కష్టమవుతోందని చెబుతూ టన్ను ఇసుక ధర రూ.500కు పైగా పెంచినట్లు తెలుస్తోంది. నిర్మాణదారులు ఇన్నాళ్లుస్థానిక వాగులు, ఏర్లలో లభించే ఇసుక నాణ్యతగా లేకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి జిల్లాల్లో గోదావరి రీచ్‌ల నుంచి తెప్పించుకుంటున్నారు. ఈక్రమాన టన్ను రూ.900 నుండి రూ.1,100 వరకు లభించిన ఇసుక ఇప్పుడు దొరకడమే కష్టమవుతోందని చెబుతున్నారు. కొందరు వ్యాపారులు సామర్థ్యం మేరకే ఇసుక తీసుకొస్తుండగా, ఇంకొందరు పూర్తిగా వ్యాపారం నిలిపివేశారు.

గతంలో ఖమ్మం నగరానికి ప్రతిరోజు సుమారు 20కి పైగా లారీల్లో వచ్చే ఇసుక ఇప్పుడు 4–5 లారీలకు మించడం లేదు. ఫలితంగా ధరలు పెంచినట్లు తెలుస్తుండగా.. తమపై అదనపు భారం పడుతోందని నిర్మాణదారులు వాపోతున్నారు. మరోపక్క ప్రభుత్వ భవనాలు, రహదారుల నిర్మాణంలోనూ అవసరమైన ఇసుకను కాంట్రాక్టర్లు ఆచితూచి కొంటూ, ధరలు మరింత పెరిగితే పనులు సాగించలేమని చెబుతున్నారు.

ఏడు చోట్ల ఇసుక డంపులు సీజ్

తిరుమలాయపాలెం: మండలంలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. గతంలో ఎనిమిది ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేయగా, శుక్రవారం అర్ధరాత్రి మరో రెండింటిని పట్టుకున్నారు. అలాగే, అక్రమంగా ఇసుకను నిల్వ చేశారనే సమాచారంతో శనివారం ఎస్ఐ కూచిపూడి జగదీష్ ఆధ్వర్యాన హైదర్‌సాయిపేట, పడమటితండా తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి ఏడు చోట్ల 180 ట్రక్కుల ఇసుకను సీజ్ చేశారు. ఈమేరకు బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

12క్వింటాళ్ల రేషన్‌బియ్యం సీజ్

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారంలో అక్రమంగా నిల్వ చేసిన 12క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు శనివారం సీజ్ చేశారు. మండలంలోని మంగ్రాజుపల్లికి చెందిన ఓ వ్యాపారి ప్రజల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని చెన్నారంలో నిల్వ చేశాడు. ఈ విషయమై అందిన సమాచారంతో పోలీసులు సీజ్ చేశారు.

తక్కువ ధరకు బంగారం పేరిట టోకరా?

రూ.17లక్షలు తీసుకుని నకిలీ బంగారం అప్పగించిన వైనం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన నలుగురు చిరు ఉద్యోగులు తక్కువ ధరకే బంగారం వస్తుందనే ప్రచారాన్ని నమ్మి రూ.17 లక్షలు మోసపోయినట్లు తెలిసింది. ఏపీని విజయవాడ సమీపాన గ్రామానికి చెందిన వ్యక్తులు మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరకే బంగారం అప్పగిస్తామని నమ్మబలకడంతో వీరు డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. ఆతర్వాత సదరు వ్యక్తులు ఇచ్చిన బ్యాగ్ తీసుకుని బయటకు వచ్చాక చూస్తే నకిలీ బంగారం ఉండడం, ఇదేమిటని అడిగితే దాడి చేస్తారనే భయంతో తిరిగి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని బయటకు చెబితే పరువు పోతుందనే భావనతో నలుగురు గోప్యంగా ఉంచినట్లు సమాచారం. ఈ విషయమై ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాష్‌ను శనివారం వివరణ కోరగా ఇలాంటి ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

యువకుడిపై దాడి చేసిన హిజ్రాపై కేసు

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలోని ఓ చికెన్ షాపులో మోహన్‌కృష్ణ నాగేందర్‌పై కత్తితో దాడి చేసిన హిజ్రా సంగి వీరబాబు అలియాస్ సాన్విపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఏన్కూర్ మండలం కోనాయిపాలెంకు చెందిన నాగేందర్ పెదతండాలోని చికెన్ షాపులో పనిచేస్తున్నాడు. ఆయనకు సాన్వితో ఏర్పడిన పరిచయంతో చనువుగా ఉంటున్నారు. కాగా, సాన్వి శనివారం అర్ధరాత్రి చికెన్ షాపు వద్దకు వచ్చి కలిసి బతుకుదామని అడిగే క్రమాన వాగ్వాదం మొదలైంది. ఆపై తనను మోసం చేశావంటూ సాన్వి ఆయనపై కత్తితో దాడి చేయగా గాయపడడంతో సమీపాన ఉన్న రాజ్‌కుమార్ కలగచేసుకుని నాగేందర్‌ను ఖమ్మం ఆస్పత్రికి తరలించాడు. ఘటనపై బాధితుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.రాజు తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య



తగరం కృష్ణ (ఫైల్)

సత్తుపల్లిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యాన ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సత్తుపల్లి మండలం గంగారం ప్రకాష్‌నగర్‌కు చెందిన తగరం కృష్ణ(32) కుటుంబంలో కలహాలతో, మద్యం మత్తులో శుక్రవారం రాత్రి ఉరి వేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమేరకు శనివారం కృష్ణ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

నాలుగు రోజుల వ్యవధిలోనే అత్తాకోడళ్ల మృతి





వీరవెంకటమ్మ (ఫైల్) కృష్ణవేణి (ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దివారిగూడెంకు చెందిన అత్తాకోడళ్లు అనారోగ్యంతో బాధపడుతూ నాలుగు రోజుల వ్యవధిలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. మద్దివారిగూడెంకు చెందిన వీరవెంకటమ్మ(60) కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతూ నాలుగు రోజుల క్రితం మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు పూర్తికాగా, అప్పటికే కేన్సర్‌తో బాధపడుతున్న వీరవెంకటమ్మ కోడలు కృష్ణవేణి(40) సైతం శనివారం మృతి చెందింది. వారం వ్యవధిలోనే అత్తాకోడళ్లు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

చికిత్స పొందుతున్న యువకుడు...

దమ్మపేట/సత్తుపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దమ్మపేట మండలంలోని గండుగులపల్లి గ్రామంలో బుధవారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో జగ్గారం గ్రామానికి చెందిన మడివి నాగేంద్రబాబు, వగ్గేల లక్ష్మణ్, సత్తుపల్లి మండలం చిన్నపాకలగూడెంనకు చెందిన కేతేపల్లి జానకీరాం (32)కు తీవ్ర గాయాలు కాగా, మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించిన విషయం పాఠకులకు విదితమే. కాగా, కేతేపల్లి జానకీరాం తలకు తీవ్ర గాయం కావడంతో, ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. జానకీరాం మరణ వార్తతో చిన్నపాకలగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నాయీబ్రాహ్మణుడు...

తిరుమలాయపాలెం: ఖమ్మం రూరల్ మండలం కోదాడ క్రాస్ వద్ద పనులు ముగించుకుని వస్తున్న ఓ వ్యక్తి కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటాడనగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తిరుమలాయపాలెం మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన నాయీబ్రాహ్మణుడు జంగాల రాందాస్(37) రూరల్ మండలం కోదాడ క్రాస్‌లోని బార్బర్ షాపులో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా అతివేగంగా వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాందాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య మమత, ఓ కుమారుడు, ఆరు నెలల కుమార్తె ఉన్నారు. ఘటనపై మమత ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.